# తూర్పు పడమరలు

పిల్లలు లేని ఆ దంపతులిద్దరూ రోజూ కాలక్షేపంకోసం ఏదో ఒక తగూ పెట్టుకుంటారు. చిన్న పోట్లాట జరగనిరోజు వాళ్ళిద్దరికీ జీవితం ఎంతో వెలితిగా బరువుగా కనబడుతుంది.

అందుకే ఆమె చాలా బాగుందన్న పుస్తకం అతను ఉత్తచెత్త అంటాడు. అతను బాగా మెచ్చుకున్న సినిమాకి ఆమె అధమ చిత్రాల్లో ప్రథమస్థానం అని ఈసడిస్తుంది.

వివాదాలకి ఫలితంగా ఇద్దరూ కాస్సేపు బిగుసుకుపోయి మౌనవ్రతం అవలంబిస్తారు. ఒకరి మూగనోముని ఎల్లా విడిపించాలనేది రెండోవాళ్ళకి సమస్యగా పరిణమించి ఇద్దరూ మనస్సులో ఉక్కపోసినంత తహతహపడి చిరునవ్వులతో, వేళాకోళాలతో రాజీపడతారు. ఈ పిల్లతగాదాలే పిల్లల్లాగా వాళ్ళిద్దరి హృదయాలమధ్య ఉయ్యాలలు కట్టి ఊగుతూవుంటయ్.

ఇవాళ పొద్దుటినుంచీ ఒకటే వాన. అతను రోజూలాగా సాయంకాలం షికారు పోవటానికి వీలులేకపోయింది. ఆమె తొందరగా వంటముగించి, స్నానంచేసి ముస్తాబైవచ్చి కుర్చీలో కూచుంది. "మహా చెడ్డ రొంప పట్టేసింది!" అనేసి తరవాత నాలుక కొరుక్కుంది.

"ఏం పట్టింది? దయ్యమా భూతమా?" అన్నాడు ఉడికిస్తూ.

"ఎందుకంత ఆక్షేపణ?" అంది రోషంగా.

"ఆక్షేపణ కాక మరేమిటి? నిక్షేపంలాగా జలుబు చేసింది అనరాదూ? రొంపట, రొంప! దిక్కుమాలిన తూర్పుగోల!" అన్నాడు.

"అదే వద్దన్నది. మాటమాటకీ తూర్పు అని ఎత్తిపొడిస్తే నేనూరుకోను తెలుసునా?" అంది ధరించబోయే సత్యభామ వేషానికి ఇదే నాంది!

"అసలు మీ తూర్పువాళ్ళంతా అద్వాన్నపుభాష మాట్లాడతారు. మీకు తెలుగే రాదు."

"పాపం మీరు మహానాజూకు భాష మాట్లాడుతారు! అసలు మీ పడమటివాళ్ళకి మాట్లాడటం చేతనైతేనా అంట! కొట్టొచ్చినట్లు, కరవనొచ్చినట్లు వుంటుందే కాని ముచ్చటగా మర్యాదగా మూడు ముక్కలు మాట్లాడండి చూద్దాం!" అని సవాలు విసిరింది.

అతను రెచ్చిపోయి "తియ్యగా మాట్లాడటం కాళ్ళకింద గోతులుతివ్వటం మాకు చేతకావు. అయ్యో! చిత్తం! బాబూ అంటూనే తడిగుడ్డలతో గొంతుకోయ్యటం మాకురాదు. మీరంతా తేనెపూసిన కత్తులు. మా మాట దురుసుగావున్నా కరుకుగావున్నా మా మనసు మీగడకన్నా తీపి. వెన్నకంటే మెత్తన!" అనేశాడు.

"అసలు మీ పడమటివాళ్ళకి... అందులో మీవూరివాళ్ళకి సభ్యత అంటే తెలుసా? అడివి మనుషులైనా నయమే మీకంటే! మీరు మాట్లాడుతుంటే చెవుల్లో సూదులు గుచ్చినట్టుంటుంది."

"మీ దీర్ఘాలూ, మీ యాసావింటే మాకు ఆముదం తాగుతున్నట్లుంటుంది. ఇది మన తెలుగేనా అనిపిస్తుంది"

"అమరేంద్ర"

"తెలుగంటే మాదే! నన్నయ మొదలుకుని కృష్ణశాస్త్రి దాకా మధుర కవులూ, మహాకవులూ మావాళ్ళే! మీనోళ్ళలో పడి తిరగట్లో బియ్యంగింజలాగా తియ్యటి తెలుగు నలిగిపోతోంది!" అంది ఆమె.

"మేం మాట్లాడేదే అసలైన పిసలైన తెలుగు. తిక్కన శ్రీనాథుడు... ఇంకా లక్షమంది మావాళ్ళు! మీవలనే తెలుగుకి తెగులుపట్టుకుంది. మీవల్లనే తెలుగువాడు అసాధ్యుడు, మోసగాడు అనే చెడ్డపేరు వచ్చింది."

"కాదు మీవల్లనే తెలుగువాడు రౌడీ, కయ్యానికి కాలుదువ్వే రౌడీ అనే అపకీర్తి వచ్చింది."

"మీవల్లనే!"

"కాదు మీవల్లనే!" అనేసి గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ కోపగృహంలో ప్రవేశించి తలుపుబిడాయించి ముసుగుతన్నింది.

అతనికూడా కోపం రెచ్చిపోయి ఏమైనా ఇవాళ బతిమాలకూడదనుకున్నాడు. పడమటివాళ్ళందరినీ ఇంత అవమానం చేసినందుకు శేషదరుగా క్షమాపణ చెప్పుకునేదాకా తను పలకడు. ఆమె కాళ్ళబేరానికి రావాలిసిందే కాని తను లొంగటం కలలోమాట! సినిమాకి వెళ్దామంటే పర్సు పడకగదిలో వుండిపోయింది. ఇప్పుడది కోపగృహంగా మారటంవల్ల అందులో ప్రవేశించే వీలులేదని వాయిదా వేశాడు. వసారాలో పచార్లుచేసి, వచ్చేపోయే గొడుగుల్నీ, తడిసి నీళ్ళు కారే మనుషుల్నీ చూసిచూసి విసుగెత్తి వీధితలుపు గడియేసి సోఫామీద వాలి కళ్ళు మూశాడు. నిద్రవస్తేగా! నిరశనవ్రతమే...

లోపల ఆమె ఉక్కకి తట్టుకోలేక... బైటికివస్తే నామర్దా అని బాధపడుతూ... చీమ చిటుక్కుమన్నప్పుడల్లా భర్తేవచ్చి తలుపు తట్టుతున్నాడేమోనని... ఇంకొంచెం బిర్ర బిగిసేది... కాకపోయేసరికి నిట్టూర్చి మనస్సులో కోపజ్వాలల్లో ఆజ్యంపోస్తూ గడియారంకేసి చూస్తూ క్షణమొక యుగంగా గడుపుతోంది. లోపల ఎలుకలు! తూర్పు పడమరలమధ్య పంతాల సమరం! బైటికి కనబడని Cold-war! ఆక్షణంలో ఎటువంటి రాజీ ప్రతిపాదనలైనా విఫలమై తీరాలిసిందే. కొమ్ములు తిరిగిన కృష్ణమీనన్ వచ్చినా తన శాంతిమంత్రం పారక తిరోగమించవలసిందే! ప్రేమలో కొన్నంతా ఏకంచేస్తే కోపం ముక్కలుచేస్తుంది! ఇంతకీ ఈ తూర్పు పడమరలమధ్య కృష్ణా గోదావరులూ, వందమైళ్ళదూరమూ తప్ప ఇంకేమున్నయ్? అయినా కోపంలో అంగుళమొక ఆమడ!

రాత్రి పదికొట్టింది. వంటింట్లో ఏదో అలికిడి అయింది. అప్పుడే కునికిపాట్లు పడుతున్న భర్త వినికూడా కదలకుండా అల్లాగే పడుకున్నాడు.

అన్నం కూరా అన్నీ కెలికినట్లుగావుంటే ఆమెకి వెంటనే అనుమానం తగిలింది. ఘనుడు! అయినా తినుతిన్నట్లు అతనికి తెలియకూడదు. గప్-చిప్‌గా పనిముగించేసి గదిలోకివెళ్ళి ఎప్పటిమాదిరి తలుపు బిడాయించుకుంది.

"బావా! అక్కా!" అంటూ తలుపు కొట్టాడు పదిన్నరబండ్డి దిగివచ్చి బావమరిది.

"ఇంటినించేనా? అంతాకులాసా?" అని తలుపుతీసి పరామర్శ చేశాడు బావ.

"కాళ్ళుకడుక్కోరా. బావతో కబుర్లు చెపుతూవుండు. నిమిషంలో అన్నం వండేస్తా! నిండు తప్పేల కుక్కతిని పోయినట్లుంది!" అంది అక్క ఏమీఎరగనట్లు.

"ఇంకాక పిల్లి వంటింట్లో చప్పుడు చేసింది. తినేసింది కాబోలు!" అన్నాడు బావ. అసలు తనకేమీ తెలియనట్లు.

"అబ్బే! నేను బెజవాడలో భోజనం చేశాను" అని అవలీలగా బొంకి అక్కకి శ్రమతప్పించాడు తమ్ముడు. ★